క్లుప్తంగా

జిల్లా పరిషత్ అతిథి గృహం ప్రారంభం



పొన్నూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని శనివారం చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా ప్రారంభించారు. వినియోగం లేక ఎంతోకాలంగా మూతపడిన భవనాన్ని లీజు ద్వారా ప్రైవేటు వ్యకులకు అధికారులు కేటాయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ అతిథి గృహం ద్వారా జిల్లా ప్రజా పరిషత్‌కు ఆదాయం సమకూర్చేలా అధికారులు పనిచేయాలని తెలిపారు. జెడ్పీ గెస్ట్ హౌస్ అన్యాక్రాంతం కాకుండా అభివృద్ధి చేసిన పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో పెదకాకాని జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, పొన్నూరు ఎంపీపీ పద్మలీల, వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందరాజు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

కొమ్మూరు(కాకుమాను): మండలంలోని కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు ఆరోగ్యం కూడా ప్రతి విద్యార్థికీ ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసేందుకు ప్రతి జిల్లాకు జెడ్పీ నిధులు మంజూరు చేయడంతో పాటు వాటిని సక్రమంగా వినియోగించే విధంగా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ముజావర్ షేక్ అసదుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

పొన్నూరు: విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. పట్టణంలోని పాత పొన్నూరు సోషల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు నజీర్ అహ్మద్ అదే పాఠశాలలోని చిన్నారులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని విద్యార్థులు తల్లిదండ్రులు చెప్పడంతో పాఠశాలకు చేరుకొని ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న ఎంఈఓ రుద్రపాటి శోభాచంద్ పాఠశాలకు చేరుకొని విచారించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిపై అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ పి. భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



గుంటూరు రూరల్: చదువు అంటే విద్యార్థులు బట్టీ పట్టి చదవడం కాదని, సాంకేతిక నిర్మాణ పరిజ్ఞానం తెలుసుకున్నపుడే సార్థకత ఉంటుందని నెక్స్‌జెన్ ఇంటర్‌నేషనల్ స్కూల్ డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు, శ్రీవిద్య తెలిపారు. గోరంట్లలోని స్కూలులో శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ఆకట్టుకుంది.విద్యార్థులుసైన్స్, విజ్ఞాన ప్రదర్శన స్టాల్స్ నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తిలకించి విద్యార్థుల్ని అభినందించారు. ప్రయోగాల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చీఫ్ ఆఫీసర్ కె. శ్రీకాంత్, ప్రిన్సిపల్ సుధీర్ కిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



పట్నంబజారు: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా వివరాలు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం వచ్చిన సమాచారం మేరకు గౌరీశంకర్ థియేటర్ వద్ద ద్విచక్ర వాహనంతో ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా తిరుగుతున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులను నగరంలోని లాలాపేటకు చెందిన షేక్ జానీబాషా, హైదరాబాద్‌లోని అశోక్‌నగర్, హనుమాన్ గుడి వద్ద నివాసం ఉండే మహంకాళి వెంకటేష్‌గా గుర్తించినట్లు తెలిపారు. నివాసాల ముందు పార్కింగ్ చేసి బైక్‌లను మారుతాళాలతో చోరీ పాల్పడుతున్నట్లు చెప్పారు. తెలిపారు. నిందితుల నుంచి రూ. 4 లక్షలు విలువ చేసే ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- వైఎ.స్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ ప్రాధాన్యం
- గుండెగుండెకూ జగనన్న- గడపగడపకూ కిరణన్న కార్యక్రమంలో బలసాని కిరణ్‌కుమార్
- తుమ్మలపాలెంలో హారతులిచ్చి ఘన స్వాగతం



మసీదులో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: రాష్ట్రంలో అన్ని వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ పాలన సాగిస్తున్న ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ కోరారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలో శనివారం రాత్రి గుండెగుండెకూ జగనన్న- గడప గడపకూ కిరణన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన కిరణ్‌కుమార్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ సంక్షేమాంధ్రప్రదేశ్‌గా మారి, ఇంటింటికీ సంక్షేమం విస్తరించిందని బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఒక్క ప్రత్తిపాడు నియోజకవర్గంలోనే సుమారు రూ. 1200 కోట్ల రూపాయలకు పైగా నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాకు చేరిందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వంలోనైనా ఇంత పెద్ద మొత్తంలో సంక్షేమ పథకాలు, లబ్ధిని చేకూర్చిన ముఖ్యమంత్రి ఉన్నారా ? అని ప్రశ్నించారు. కుట్రలు, కుతంత్రాలకు తెరలేపి, అసత్యాలే అస్త్రాలుగా చేసుకుని ప్రతిపక్షాలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడుతున్నాయని చెప్పారు. ధర్మానికీ, అధర్మానికీ జరుగుతున్న ఎన్నికల సంగ్రామంలో మనమంతా ధర్మంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మరోసారి అయనను సీఎంగా చేసుకోవలసిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని బలసాని కోరారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న బలసాని కిరణ్ కుమార్

కాకుమాను: మహిళల్ని ఆర్థికంగా అన్ని విధాలుగా ఆదుకుని వారిని లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయ కర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక డాక్టర్ వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం మండలంలోని మహిళలకు 4వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పలువురు అక్కాచెల్లెమ్మలు జగనన్న పథకాల ద్వారా స్వయం ఉపాధి పొంది సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. సీఎంగా జగనన్న మరో 30 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రంలో పేదరికం ఉండదని చెప్పారు. ఆయన్ను ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా పేద,బడుగు,బలహీన వర్గాలు,బీసీ,మైనార్టీలపై ఉందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా నాలుగవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కు నమూనాను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, గ్రామ సర్పంచ్ శివకుమారి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, ఎంపీటీసీ సభ్యుడు కానుగుల పరమేశ్వరరావు, నేతలు గేరా పున్నారావు, మెరిగల రవిబాబు, ఏపీఎం సోమశేఖర్,డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన



పార్టీలో చేరిన వారితో అంబటి మురళీకృష్ణ

- పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

పొన్నూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జన రంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మామిళ్లపల్లిలోని ఆయన నివాసంలో శనివారం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మురళీకృష్ణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు గతంలో జరిగిన ఎన్నికల్లో వందల సంఖ్యలో హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత ఒక్కటి కూడా అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. సీఎం జగన్ ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకొని వారికి ఇచ్చిన హామీల్ని వంద శాతం అమలు చేసి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేరువ చేస్తున్నారని చెప్పారు. దగా, మోసం, వెన్నుపోటు రాజకీయాలలో దిట్ట చంద్రబాబని మండిపడ్డారు. ఆయన మోసాన్ని గ్రహించడం వల్లనే టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారని మురళీకృష్ణ స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అందరం కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో చెట్టుపల్లి కృష్ణ, అంబాల శివరామకృష్ణ, అంబాల పిచ్చయ్య, అంబాల చిన్న వెంకటరామయ్య, అంబాల శ్రీనివాసరావు, అంబాల నవీన్, అంబాల సునీల్, శీలం జగదీష్ బాబు, చింతలపూడి వెంకటరామయ్య, అంబాల సుబ్రహ్మణ్యం ఉన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీటీఏ సౌత్ రీజియన్ అధ్యక్షుడు వెంకటరమణ, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఏపీటీఏ సౌత్ రీజియన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం. వెంకటరమణ తెలిపారు. నాలుగు రోజులుగా చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మా ఉమెన్స్ లీగ్- 2024 పోటీలు శనివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాల్ని నిర్వహించేందుకు చిప్స్ కళాశాల ఎల్లపుడూ ముందుంటుందన్నారు. కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీటీఏ నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ మిలింద్ జె ఉమేకర్ మాట్లాడుతూ ఏపీటీఏ ఆధ్వర్యంలో ఇటువంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహించటం సంతోషకరమని పేర్కొన్నారు. క్రీడల ద్వారా నూతనోత్తేజంతో మహిళలు ఉపశమనం పొంది, మళ్లీ అకడమిక్ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే వీలుంటుందని తెలిపారు. స్త్రీలను అన్ని రంగాల్లో గౌరవించడం ముఖ్య ధర్మమని చెప్పారు. అనంతరం పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ విద్యాధర్, రాష్ట్ర ఏపీటీఏ ఆఫీస్ మెంబర్స్ వెంకటరమణ, అంకమ్మ చౌదరి, లక్ష్మణరావు, డి. నరేంద్ర, ఉమెన్ ఫోరం కన్వీనర్ కె. పద్మలత, కళాశాల చైర్మన్ ఆర్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి



చేబ్రోలులో జరిగిన పల్స్ పోలియో ర్యాలీలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, విద్యార్థులు



ప్రత్తిపాడులో పల్స్ పోలియోపై ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో ఈనెల 3 నుంచి 5 వరకు నిర్వహించనున్న పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గొట్టిపాడు, ప్రత్తిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ మేరియునిస్, డాక్టర్ దివ్య మేఘన తెలిపారు. ప్రత్తిపాడు మండలంలోని పదహారు గ్రామ పంచాయతీల్లో 48,829 మంది జనాభా, 14,440 కుటుంబాలు ఉన్నాయన్నారు. వారిలో 0–5 సంవత్సరాల చిన్నారులు 3,206 మంది ఉన్నారని చెప్పారు. వీరికి పోలియో చుక్కలు వేసేందుకు గాను మండలంలో 23 పోలియో చుక్కల కేంద్రాల్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

చేబ్రోలులో..

పోలియో మహమ్మారి నుంచి రక్షణ కోసం చిన్నారులకు తప్పనిసరిగా చుక్కలు వేయించాలని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి అబ్రహం లింకన్ తెలిపారు. చేబ్రోలులో శనివారం పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మండల పరిధిలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో చిన్నారులు 4176 మంది ఉన్నారన్నారు. వీరందరికీ ఆదివారం జరిగే పల్స్ పోలియోలో చుక్కలు వేయటానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వివిధ గ్రామాల్లో 29 కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ర్యాలీలో వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో శనివారం పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రత్తిపాడు కోలొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యమేఘన ఆధ్వర్యంలో స్థానిక ఆస్పత్రి నుంచి అంకమ్మ గుడి, ఇందిరాగాంధీ సెంటరు మీదుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరకు రెండు చుక్కలతో నిండు జీవితం, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియోచుక్కలు వేయించాలి అంటూ నినాదాలతో ర్యాలీ చేపట్టారు. పెదగొట్టిపాడులో డాక్టర్ మేరియునిస్ నేతృత్వంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆదివారం కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని, మిగిలిన వారికి మైగ్రేటెడ్, హైరిస్క్ ప్రాంతాల్లోని వారికి సోమ, మంగళవారాల్లో సిబ్బంది ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతో పాటు వినోదం అవసరం



ప్రత్తిపాడు: విద్యార్థులకు విద్యతో పాటు వినోదమూ అవసరమేనని 'పలాస' సినిమా ఫేమ్ హీరో రక్షిత్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సంస్కృతి- 2024 ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా పలాస ఫేమ్, సినిమా హీరో రక్షిత్ హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు రక్షిత్, భ్రమర టౌన్ షిప్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు చేతుల మీదుగా రూ. 5 లక్షల బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హీరో రక్షిత్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం సంస్కృతి వంటి వినోదాత్మక కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం మూడో సంవత్సరం ఈసీఈ విద్యార్థులు రైతుల కోసం తయారు చేసిన సీడ్ మిత్ర స్టార్టప్‌ను కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, ప్రోగ్రామ్ కన్వీనర్ గోనుగుంట్ల రామస్వామి, కో-కన్వీనర్ దొమ్మేటి విజయసారథి, హరికృష్ణ, కందెపు సునీత, డీన్ పోపూరి రమేష్ బాబు, ప్రొఫెసర్ జంపని కిశోర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల రోజులు జీవితంలో మరుపురానివి

- ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జడ్జి ఆకుల వెంకటశేషసాయి
- ఘనంగా కళ్లం ఇంజినీరింగ్ కళాశాల 13వ వార్షికోత్సవం



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి

గుంటూరు రూరల్: ప్రతి వ్యక్తికీ కళాశాలలో చదివే రోజులు జీవితంలో గుర్తుండిపోతాయని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జడ్జి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి పేర్కొన్నారు. గుంటూరు రూరల్ మండలం చౌడవరం గ్రామంలోగల కళ్లం ఇంజినీరింగ్ కళాశాల 13వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా విద్యా దానం ఎంతో గొప్పదన్నారు. సమష్టిగా కలిసి చర్చించుకుంటే ఎటువంటి సమస్యలనైనా పరిష్కరించుకోగలమని సూచించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను గౌరవించాలన్నారు. ఎవరితోనూ శత్రుత్వం, విమర్శించే గుణం ఉండకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరిలో అపారమైన శక్తి ఉంటుందని దానిని వెలికి తీసి సాధన చేస్తే విజయం సొంతమవుతుందన్నారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే గురువులు సమాజాన్ని పరిచయం చేసి ఎలా బతకాలో నేర్పుతారన్నారు. మంచి మనసుతో కళ్లం హరనాథరెడ్డి కళాశాలను ఏర్పాటు చేసి ఎందరో పేద విద్యార్థులకు విద్యను అందించటంతోపాటు ప్రతి ఏటా రూ.30 లక్షల మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించటం గొప్ప విషయమన్నారు. గుంటూరు అంటే కారం అని అంటారు కానీ నేడు గుంటూరు అంటే జ్ఞానం, విద్య అని చెప్పుకోవచ్చని తెలిపారు. టెక్ మహీంద్రా సంస్థ రిక్రూట్‌మెంట్ మేనేజర్ వీరంరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అతిథులు 300 మంది విద్యార్థులకు రూ.30 లక్షల మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని అలరింపజేశాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కళ్లం మోహనరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వరరెడ్డి, కళాశాల డైరెక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధి కల్పనాధికారి పీఎల్ మాధవరావు, ఏవో కళ్లం నవ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోబోటిక్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై హ్యాకథాన్



హ్యాకథాన్‌లో ఆవిష్కరణలు చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రోబోటిక్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై హ్యాకథాన్ నిర్వహించారు. సీఎస్ఈ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో హ్యాక్‌బోర్డ్ ఫౌండర్ సీఈవో మహేస్ బృందం పర్యవేక్షణలో నిర్వహించిన హ్యాకథాన్‌లో 36 టీంలు పాల్గొన్నాయి. పలు వినూత్న అంశాల్ని విద్యార్థులు ఆవిష్కరించారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలైన శుభం జేకే గ్రూపు (ముంబై), చరిష్మా (యూఎస్ఏ) జ్యూరీ ప్రతినిధులుగా వ్యవహరించారు. క్లీన్ బాట్, ఆర్కిడ్రా, ఆటోమేటెడ్ షాపింగ్ ట్రాలీ, ల్యాండ్‌మైన్ డిటెక్టర్, మిసైల్ లాంఛర్ వంటి ఆవిష్కరణలు సమాజ హితానికి దోహదపడేలా ఉన్నాయని కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. బాబు, అకడమిక్ డైరెక్టర్ కె. హరిబాబు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి జి. మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకర కంటి ఆసుపత్రి సేవలు ప్రశంసనీయం

- డీఎంహెచ్ఓ డాక్టర్ కె. విజయలక్ష్మి
- ఘనంగా 20వ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలనలో డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, రత్నగిరి బాబు, బొమ్మిదాల కృష్ణమూర్తి

పెదకాకాని : అంధత్వ నివారణకు శంకర కంటి ఆసుపత్రి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రిలో శనివారం రాత్రి జరిగిన 20వ వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 సంవత్సరాల ప్రయాణంలో శంకర కంటి ఆసుపత్రి ఎంతో ప్రగతిని సాధించిందన్నారు. ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జనచైతన్య డైరెక్టర్ రత్నగిరి బాబు మాట్లాడుతూ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి కోరిక మేరకు పెదకాకానిలో ఆసుపత్రి నిర్మాణానికి కోట్ల రూపాయల విలువ చేసే ఐదు ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇచ్చినట్లు చెప్పారు. పేద ప్రజలకు సేవాభావంతో కంటి చూపు ప్రసాదిస్తున్నందుకు శంకర కంటి ఆసుపత్రి సేవలు అభినందనీయమన్నారు. నూతన శంకర కంటి ఆసుపత్రి భవనానికి జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మాదల రత్నగిరిబాబు, మాదల శకుంతల, మాదల రాంభాస్కర్ చేతుల మీదుగా జనచైతన్య కుటుంబం నుంచి రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. ఆసుపత్రి సీఎంఓ డాక్టర్ సుధాకర్ పొట్టి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 12 ఆస్పత్రులు స్థాపించి, వేలాది మందికి చూపు ప్రసాదించడం ఎంతో గొప్ప వరం భావిస్తున్నామన్నారు. అనంతరం హాస్పిటల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆటపాటలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. 20 ఏళ్ల పూర్తి చేసుకున్న వారికి లాంగ్ సర్వీసు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆసుపత్రి యూనిట్ హెడ్స్ త్రిపుర, మాధవి, పలు విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా అంకిరెడ్డిపాలెం

- ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి
- జెడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాలలో భోజనశాల వాచ్‌మేన్ గదులకు శంకుస్థాపన



గ్రామస్తులతో మాట్లాడుతున్న అప్పిరెడ్డి

గుంటూరు రూరల్: తాను పుట్టి పెరిగి ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన అంకిరెడ్డిపాలెంను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. తనతో పాటు గ్రామ పెద్దలు కూడా అభివృద్ధి కమిటీగా ఏర్పడి గ్రామాభ్యుదయానికి పాటు పడుతున్నట్లు ఆయన వెల్లడించారు. మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో మున్నంగి సాంబిరెడ్డి దాతృత్వంతో మధ్యాహ్న భోజనశాల, మున్నంగి మాకిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు మున్నంగి కిశోర్‌రెడ్డి, మున్నంగి అంజిరెడ్డి, లీలావర్ధన్‌రెడ్డి దాతత్వంతో నిర్మించ తలపెట్టిన వాచ్‌మెన్ గది నిర్మాణ పనులకు గ్రామ పెద్దలతో కలిసి అప్పిరెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో నాడు నేడు పథకంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ఒక్క అంకిరెడ్డిపాలెం గ్రామానికే కాక చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులకు సైతం ఉపయుక్తంగా ఉండేలా జిల్లా పరిషత్ హైస్కూల్, జూనియర్ కళాశాలను అన్ని వసతులతో ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సరోజిని, జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ రామచంద్రరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గుంటూరు అర్బన్‌బ్యాంక్ డైరెక్టర్ బండా రవీంద్రనాథ్, గుంటూరు ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ సుభాని, కార్పొరేటర్ వెంకటకృష్ణ, నల్లపాడు డివిజన్ అధ్యక్షుడు దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, అంకిరెడ్డిపాలెం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కుర్రా సాంబిరెడ్డి, లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, కుర్రా పుల్లారెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, దేవగిరి వీర గంగాధరరెడ్డి పాల్గొన్నారు.